సాక్షి
అనంతపురం

మంగళవారం। 13। జూన్। 2023



చీనీ టన్ను రూ.42 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.42 వేలు పలికాయి. 970 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



మెరిసే రాయి.. వజ్రమైతే..

తొలకరి వర్షాలు పడటంతో వజ్రాన్వేషణ మొదలైంది. వజ్రకరూరు ప్రాంతంలోని ఎర్ర నేలల వద్దకు పలువురు చేరుకుని అణువణువూ శోధిస్తున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
40.3°/23.5°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్ తదితరులు

అనంతపురం అర్బన్: జిల్లాలో 41 గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభమయ్యాయని కలెక్టర్ గౌతమి స్పష్టం తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రూపొందించిన 'ప్రజల ముంగిటకు రిజిస్ట్రేషన్ సేవలు' పోస్టర్లు, బ్రోచర్లు, కరపత్రాలను కలెక్టర్ సోమవారం రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇక నుంచి సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను పొందవచ్చన్నారు. ముఖ్యంగా దస్తావేజుల రిజిస్ట్రేషన్ (ఇంటి స్థలం, వ్యవసాయ భూములు, వీలునామాలు, దత్తత తదితరాలు) చేస్తారన్నారు. ఈసీ (ఎన్‌కంబర్స్‌మెంట్ సర్టిఫికెట్), డాక్యుమెంట్ నకలు, భూముల మార్కెట్ విలువ వివరాలు పొందవచ్చన్నారు. ప్రత్యేక వివాహాల రిజిస్ట్రేషన్ వంటి సేవలు కూడా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం, ఆర్డీఓ మధుసూదన్, రిజిస్ట్రేషన్ సిబ్బంది శివ, నారాయణ, రిషికేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన 1,158 మెట్రిక్ టన్నుల ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న రేక్ ఆఫీసర్ ఎం.రవి, ఏఓ ప్రసాద్

అనంతపురం అగ్రికల్చర్: స్పిక్ కంపెనీ నుంచి 1,158 మెట్రిక్ టన్నుల ఎరువులు సోమవారం జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. రాప్తాడు ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి రైల్వే వ్యాగన్ల ద్వారా జిల్లాకు చేరిన ఎరువులను ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి పరిశీలించారు. 332.25 మెట్రిక్ టన్నుల యూరియా, 598.85 మెట్రిక్ టన్నుల డీఏపీ, 173.4 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం కాంప్లెక్స్, అలాగే 53.85 మెట్రిక్ టన్నుల సింగిల్ సూపర్‌పాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) ఎరువులు సరఫరా అయినట్లు తెలిపారు. ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి ఎరువులు సరఫరా అవుతున్నాయన్నారు. జాయింట్ కలెక్టర్, డీఏఓ ఆదేశాల మేరకు మొదటి ప్రాధాన్యతగా ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌లు, తర్వాత ఇండెంట్ ప్రకారం రిటైల్, హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. మిగతావి మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ బిల్లులు విడుదల

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపట్టిన 2,320 పనులకు సంబంధించిన బిల్లులు రూ.40.44 కోట్లు విడుదలైనట్లు డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఇందులో నియోజకవర్గాల వారీగా ఉరవకొండకు రూ.2.40 కోట్లు, గుంతకల్లు రూ.1.02 కోట్లు, కళ్యాణదుర్గం రూ.2.25 కోట్లు, రాయదుర్గం రూ. 4.33 కోట్లు, తాడిపత్రి రూ.3.87 కోట్లు, శింగనమల రూ.4.65 కోట్లు, రాప్తాడు రూ.4.38 కోట్లతో పాటు పంచాయతీ రాజ్ విభాగానికి రూ.17.50 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఈ నిధులను రెండు మూడు రోజుల్లో కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు వెల్లడించారు. మరో రూ.18 కోట్ల బిల్లులు వారం రోజుల్లో మంజూరవుతాయన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



అనంతపురం రూరల్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాల్లో ప్రవేశాలకు మూడో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాల బాలికలకు ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బాలుర వసతి గృహంలో వంద మందికి, బాలికల వసతి గృహంలో 50 మందికి వసతి కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 91777 66540, 94927 60438 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మోగిన బడిగంట



వేసవి సెలవులు ముగిశాయి.. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది.. వేకువ అయ్యిందో లేదో సంబరంగా నిద్రలేచారు.. ఇన్నాళ్లూ ఆటపాటలతో హాయిగా గడిపిన విద్యార్థులు.. ఆదరాబాదరాగా స్నానమాచరించారు.. ఉదయం 7.30 గంటలకు బడిగంట మోగగానే బంగారు భవితకు బాట వేసుకోవాల్సిన వేళ అయ్యిందని గుర్తొచ్చింది.. పరుగు పరుగున పాఠశాలలకు చేరుకున్నారు.. వచ్చీరాగానే గురువులకు నమస్కరించారు.. ప్రార్థన అనంతరం తోటి పిల్లలను పరిచయం చేసుకున్నారు.. మొదటిరోజే 'మామయ్య విద్యాకానుక'లు అందుకున్నారు. కొత్తపుస్తకాలు చేతికందిన ఆనందం.. చిరునవ్వుతో అలా అలా తిరగేస్తూ.. ఆ పేజీల నుంచి వచ్చే పరిమళాన్ని ఆస్వాదించారు. 11.30 గంటలకు బెల్ కొట్టగానే 'జగనన్న గోరుముద్ద' భోజనం తిన్నారు.. పుస్తకాలు బ్యాగులో సర్దుకున్నారు.. తొలిరోజు భలే గడిచిందని సంబరంగా ఇంటిబాట పట్టారు..



అనంతపురం రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో సరస్వతి విగ్రహానికి నమస్కరిస్తున్న విద్యార్థినులు



అనంతపురం ఎస్కేడీ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌లోని పుస్తకాలను చూపుతున్న విద్యార్థినులు

- తొలిరోజే విద్యార్థుల చేతుల్లో జేవీకే కిట్లు
- 2,18,983 కిట్ల కోసం రూ.52.5 కోట్ల వ్యయం

రాప్తాడురూరల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం బడిగంట మోగింది. ఎండలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 17 వరకు ఒంటిపూట బడులే నిర్వహించనున్నారు. తొలిరోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను అందజేశారు. జిల్లాలోని 31 మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,18,983 మంది విద్యార్థులకు కిట్లను అందజేస్తున్నారు. ఒక్కో కిట్టు కోసం ప్రభుత్వం రూ.2,400 ఖర్చు చేసింది. ఈ లెక్కన జిల్లాకు రూ.52.5 కోట్లను జేవీకే కిట్ల కోసం వెచ్చించింది. కిట్‌లో బ్యాగు, బెల్టు, డిక్షనరీ, నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్, వర్క్‌బుక్స్, షూ, యూనిఫాం (మూడు జతలు) ఉన్నాయి.

జేవీకే కిట్ల పంపిణీ..

జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ జగనన్న విద్యా కానుక కిట్లను ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. రాయదుర్గంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కిట్ల పంపిణీలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతపురంలో ఎస్కేడీ పాఠశాలలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య చేతుల మీదుగా జేవీకే కిట్లు అందజేశారు. ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం చాయాపురం పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా విద్యా కానుక కిట్లు అందజేశారు.



అనంతపురం పొట్టిశ్రీరాములు స్కూలులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



అనంతపురం శారద స్కూల్‌లో ప్రారంభమైన తరగతులు



అనంతపురంలోని ఛత్రపతి శివాజీ పాఠశాలలో విద్యార్థికి అక్షరాలు దిద్దిస్తున్న టీచర్

మా స్కూల్ చాలా బాగుంది



ఈరోజు పాఠశాలకు వెళ్లగానే పుస్తకాలు, యూనిఫాంలు, షూ, బ్యాగ్.. అన్నీ ఇచ్చారు. మా స్కూల్ కూడా రంగురంగుల బొమ్మలతో అందంగా ఉంది. స్కూల్‌లో మంచి రాగి జావ ఇచ్చారు. మా కోసం ఇన్ని మంచి పనులు చేస్తున్న జగన్ మామయ్య మేలు ఎప్పటికీ మరువలేం.

–సాయి శశి, మూడో తరగతి

బాగా చదువుకుంటా



ఈ రోజు స్కూల్‌లో చదువుకోవడానికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, యూనిఫాం, బ్యాగ్ ఇచ్చారు. జగన్ మామయ్యే ఇవన్నీ నాకు పంపారంట. చాలా ఆనందంగా ఉంది. నేను బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకుంటా.

– అభిషేక్, ఐదో తరగతి

మంచి మార్కులతో పాసవుతా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాకోసం ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. 'నాడు–నేడు'తో మా పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపర్చారు. చక్కగా చదువు కోవడానికి విద్యాకానుక కిట్లు ఇస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బాగా చదువుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ర్యాంక్ సాధిస్తా.

– తహసిన్ భాను, పదో తరగతి విద్యార్థిని

బాధ్యతగా అర్జీల పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: అర్జీల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్లు కేశవనాయుడు, శ్రీనివాసులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 527 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమస్య పరిష్కారం కాకపోయినా కొందరు అధికారులు పరిష్కరించినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. అర్జీ పరిష్కారం కానిదైతే అదే విషయాన్ని అర్జీదారుకు తెలియజేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వాలే తప్ప పరిష్కరించనట్లు చూపకూడదన్నారు. అర్జీదారు సంతృప్తి చెందకపోతే అది రీ–ఓపెన్ అవుతుందన్నారు. కాబట్టి అర్జీదారులతో నేరుగా మాట్లాడి, సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని నాణ్యతగా పరిష్కరించాలని చెప్పారు.

బాలకార్మిక రహిత జిల్లాగా చేద్దాం

అనంతపురం అర్బన్: సమష్టిగా కృషి చేసి బాల కార్మిక రహిత జిల్లాగా చేద్దామంటూ కలెక్టర్ గౌతమి అధికారులు, స్వచ్ఛంద సంస్థలకు పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని చైల్డ్‌లైన్ సంస్థ రూపొందించిన చైతన్య అవగాహన పోస్టర్లను కలెక్టర్ సోమవారం రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాధ్యతగా కృషి చేస్తామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలకు అడ్డుకట్ట, బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. మండల, డివిజన్, జిల్లాస్థాయిలో రెవెన్యూ, మహిళా శిశు సంక్షేమ, కార్మిక, పోలీసు, విద్యా, అన్ని సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతగా భాగస్వాములై ప్రజా చైతన్య అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఐదేళ్ల నుంచి ఎనిమిదేళ్ల వయసున్న పిల్లలు బడి బయట ఉండకూడదన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ రఘురాములు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బాలల పరిరక్షణ అధికారి సుబ్రమణ్యం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాను తాకిన ఆశల 'నైరుతి'

అనంతపురం అగ్రికల్చర్: 'నైరుతి' రుతుపవనాలు సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లాను తాకినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) విడుదల చేసిన ఛాయాచిత్రం స్పష్టం చేస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నైరుతి విస్తరించి ప్రభావం చూపిస్తే మంచి వర్షాలు కురిసే అవకాశం ఉంది. జూన్ నుంచి అక్టోబర్ 15 వరకు నైరుతి ప్రభావంతోనే వర్షాలు కురవనున్నాయి. ఈ ఖరీఫ్‌లో 319.6 మి.మీ సాధారణ వర్షపాతంగా పరిగణించారు. అనుకున్న ప్రకారం జూన్, జూలైలో వర్షాలు కురిస్తే 4 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ నెల 15 నుంచి జూలై ఆఖరు వరకు పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు ఇప్పటికే ప్రకటించారు. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంటలోని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ తెలిపారు.



శ్రీసత్యసాయి జిల్లాను తాకినట్లు చూపుతున్న ఐఎండీ ఛాయాచిత్రం

రాష్ట్రంలోనే తొలి మహిళా సహకార డెయిరీ

- 'అమ్మ' పాల డెయిరీ రేపే ప్రారంభం
- ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన ఏర్పాటు
- రూ.20 కోట్ల సొంత ఖర్చుతో డెయిరీ నెలకొల్పిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



డెయిరీలో ఏర్పాటు చేసిన మిషనరీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో పైలా తదితరులు

రాప్తాడురూరల్: రాష్ట్ర చరిత్రలో తొలి మహిళా సహకార డెయిరీ ఏర్పాటుకు రాప్తాడు నియోజకవర్గం వేదిక కాబోతోంది. పాడి మహిళా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆర్థికాభివృద్ధి వైపు నడిపించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని దాదాపు రూ. 20 కోట్ల సొంత నిధులతో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన ఐదెకరాల స్థలంలో డెయిరీ నిర్మించారు. ఈ డెయిరీకి 'అమ్మ' (అనంతపురం మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్) అని నామకరణం చేశారు. ఈ నెల 14న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా డెయిరీ ప్రారంభం కానుంది. దాదాపు 20 వేలమంది మహిళా పాడి రైతులకు నికర ఆదాయం కల్పించాలనే సంకల్పంతో 'అమ్మ డెయిరీ' ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ డెయిరీని నియోజకవర్గంలోని పాడి రైతులకు అంకితం చేయనున్నారు.

ములకనూరు డెయిరీ ఆదర్శం..

తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామంలోని 'ములకనూరు మహిళా సహకార డెయిరీ' దేశంలోనే మొదటి మహిళా డెయిరీ. ఈ డెయిరీకి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. మహిళా రైతులు 'ములకనూరు మహిళా సహకార డెయిరీ'లో భాగస్వాములై చేయీచేయి కలిపి ఆర్థిక ప్రగతి సాధించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పలుమార్లు ఈ డెయిరీని సందర్శించారు. అక్కడి మహిళా రైతుల విజయగాథను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. దీన్ని ఆదర్శంగా తీసుకునే 'అమ్మ' డెయిరీ ఏర్పాటుకు పూనుకున్నారు.

అమ్మ డెయిరీ ప్రత్యేకతలు

- ఈ డెయిరీ పూర్తిగా మహిళల సారథ్యంలోనే కొనసాగుతుంది.
- రోజూ 1.20 లక్షల లీటర్ల పాలను సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.
- డెయిరీ ద్వారా పాలతో పాటు పెరుగు, లస్సీ, బాదంపాలు, నెయ్యి, కోవా, పన్నీరు లాంటి పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందించనున్నారు.
- ప్రతి 15 రోజులకు ఒకసారి మహిళా పాడి రైతులకు బిల్లులు చెల్లిస్తారు. ప్రైవేట్ డెయిరీల దోపిడీ నుంచి పాడి మహిళా రైతులను రక్షిస్తూ ఆశించిన ధర కల్పించి వారి ఆదాయాన్ని పెంచడమే డెయిరీ లక్ష్యం.

14న బైక్ ర్యాలీ

ఆత్మకూరు: ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన 'అమ్మ' డెయిరీ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న ఉదయం పది గంటలకు అనంతపురంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం అనంతపురంలోని తన నివాసంలో ఆత్మకూరు మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవం రోజున నిర్వహించే బైక్ ర్యాలీకి మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

అమ్మ డెయిరీని ఆదరించండి

అనంతపురం టవర్‌క్లాక్: పాడి మహిళా రైతులకు ఆదాయం చేకూరేలా ప్రారంభిస్తున్న అమ్మ (అనంతపురం మహిళా మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్) డెయిరీని ఆదరించాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. సోమవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలమూరు జగనన్న లే ఔట్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మ డెయిరీని బుధవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇతర పాల డెయిరీలు లాభార్జన కోసమే వ్యాపారాలు చేస్తున్నాయని, కానీ 'అమ్మ' డెయిరీ ఇతర డెయిరీల కంటే లీటరుపై రూపాయి ఎక్కువగా పాడి రైతులకు చెల్లిస్తుందన్నారు. వినియోగదారులకు రూపాయి తక్కువతో పాలు అందిస్తామన్నారు. ప్రారంభోత్సవం వరకు మాత్రమే తమ బాధ్యత అని, డెయిరీ నిర్వహణ పూర్తిగా మహిళా పాడి రైతులదేనని స్పష్టం చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో 5వేల నుంచి 10వేల మందికి ఆవుల కొనుగోలుకు రుణాలు మంజూరు చేయిస్తామన్నారు.

బాబు మోసంలో బీజేపీకీ భాగం..

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి, మోసాల్లో బీజేపీకి కూడా భాగం ఉందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం చంద్రబాబు స్క్రిప్టులో భాగమేనన్నారు. చంద్రబాబు మోసాలు ప్రజలు గమనిస్తున్నారని, సంక్షేమ పాలన సాగిస్తున్న జగనన్నకే ప్రజలు మళ్లీ పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నాయకులు ధనుంజయ యాదవ్, చిట్రా వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే..

సహకార వ్యవస్థను పునర్నిర్మాణం చేసే ప్రయత్నంలో భాగంగా 'తోపుదుర్తి మహిళా సహకార డెయిరీ సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో 'అమ్మ' డెయిరీని ఏర్పాటు చేస్తున్నాం. పాడి మహిళా రైతులతో ఫెడరేషన్ ఏర్పాటు చేశాం. వారి కోసమే డెయిరీ నిర్మించి ఇస్తున్నాం. ఇది పూర్తిగా మహిళా రైతులదే. వారే కూలీలు, వారే యజమానులు. డెయిరీని నడుపుకొనే నైపుణ్యం సాధించేదాకా తోపుదుర్తి కుటుంబం సహకారం అందిస్తుంది. జిల్లా ప్రజలందరి సహకారం ఉండాలి. డెయిరీకి పాలు పోసే రైతులందరూ యజమానులు. ఆదాయమూ వారికే.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

300 ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటు లక్ష్యం

- ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీ రఘునాథరెడ్డి



బి.రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: సూక్ష్మ తరహా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు 35 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) బి.రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఈ ఏడాది 300 చిన్న తరహా కుటీర పరిశ్రమలను ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ పథకం (పీఎం ఎఫ్‌ఎంఈ) కింద ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. వేరుశనగ, బేకరీ, మిరప, బెల్లం, పొటాటో ఆధారిత ఉత్పత్తులు, రెడీ టూ ఈట్ చిరుతిళ్ల తయారు చేసే యూనిట్లకు ప్రాధాన్యత ఇస్తూనే మిగిలిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటునూ ప్రోత్సహిస్తామన్నారు. ఎఫ్‌పీఓలు, ఎస్‌హెచ్‌జీలు, వ్యక్తిగత ఎంటర్‌ప్రెన్యూర్స్ ముందుకు వస్తే రూ.10 లక్షల యూనిట్ విలువలో గరిష్టంగా 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. యూనిట్ విలువలో 10 శాతం లబ్ధిదారులు భరిస్తే మిగిలిన 55 శాతం మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 79950 86792, 94402 69833 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వృద్ధాశ్రమాలను రిజిస్టర్ చేసుకోండి

అనంతపురం రూరల్: ఉమ్మడి జిల్లాలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరి రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్‌రసూల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్న వారు, నిర్వహించాలనుకునే వారు రూ.100 డిమాండ్ డ్రాఫ్ట్ లేదా క్రాస్ చెక్‌ను వెంటనే వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలి. రిజిస్ట్రేషన్ లేకుండా ఆశ్రమాలు ఏర్పాటు చేస్తే రూ.25 వేలు జరిమానా విధిస్తారు.

మెరిసే రాయి.. వజ్రమైతే..



తొలకరి పలకరించగానే వారిలో ఆశలు చిగురిస్తాయి. సద్ది సిద్ధం చేసుకుని పొలాల బాట పడతారు. నేలలో అణువణువూ శోధిస్తారు. ప్రతి రాయి కదుపుతారు. మెరిసే రాళ్లను సేకరిస్తారు. వాటిని తీసుకెళ్లి ఏజెంట్లకు చూపుతారు. అది వజ్రమైతే వారి పంట పండినట్లే! లేదంటే మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతారు. ఇలా ఏటా వజ్రాల వేట నిరాటంకంగా సాగుతోంది. దశాబ్దాలుగా సాగుతున్న ఈ వేటలో కొందరు లక్షాధికారులు కాగా... మరికొందరు అన్వేషకులుగానే మిగిలిపోయారు.

- ఎర్రనేలల్లో జోరుగా వజ్రాల వేట
- సుదూర ప్రాంతాల నుంచి సైతం జనం రాక
- నందడిగా మారిన వజ్రకరూరు పరిసర పొలాలు
- దశాబ్దాలుగా కొనసాగుతున్న వజ్రాన్వేషణ
- ఏటా కొందరిని వరిస్తున్న 'అదృష్టం'


అన్వేషణ ఫలించేనా? : వజ్రకరూరు పరిసర పొలాల్లో వజ్రాల కోసం వెతుకుతున్న జనం


వజ్రకరూరులోని డైమండ్ ప్రాసెసింగ్ ప్లాంట్


పిల్లలతో కలసి వజ్రాన్వేషణకు వచ్చిన దంపతులు

అనంతపురం డెస్క్: వజ్రాల పేరు చెప్పగానే టక్కున గుర్తుకొచ్చే ఊరు వజ్రకరూరు. ఇక్కడ దొరుకుతున్న వజ్రాల కారణంగానే కవులూరు గ్రామం కాస్తా కాలక్రమేణా కరూరుగా..వజ్రకరూరుగా రూపాంతరం చెందింది. ఇక్కడ వజ్రాలు ఉన్నట్లు బ్రిటీష్ హయాంలోనే గుర్తించారు. అప్పట్లోనే ప్రత్యేక కంపెనీ ఏర్పాటుచేసి అన్వేషణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వపరంగా వజ్రాన్వేషణ అంత లాభదాయకంగా లేదు కానీ.. సామాన్యుల అన్వేషణ మాత్రం ఏటా కొనసాగుతూనే ఉంది.

తొలకరి పలకరించగానే..

ప్రతి ఏటా జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు మొదలు కాగానే వజ్రకరూరు ప్రాంతం కొత్త వ్యక్తులతో కళకళలాడుతూ ఉంటుంది. వజ్రకరూరు చుట్టూ ఐదు కిలోమీటర్ల మేర ఎర్రనేలలు జనంతో రద్దీగా కనిపిస్తాయి. ఒక్కో పొలంలో 30-40 మంది వజ్రాల కోసం వెతుకుతుంటారు. బలమైన వర్షాలు పడినప్పుడు ఈ సంఖ్య వందకు పైగానే ఉంటుంది. వాననీటి ప్రవాహం వల్ల భూమిలోని వజ్రాలు పైకి తేలి.. దిగువ ప్రాంతాలకు కొట్టుకొచ్చే అవకాశం ఉండడంతో ఎక్కువమంది ఆ దిశగా అన్వేషణ సాగిస్తుంటారు. స్థానికులే కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలలు, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలు, కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా వాహనాల్లో ఇక్కడికి వచ్చి వజ్రాన్వేషణలో నిమగ్నమవుతున్నారు. ఇతర ప్రాంతవాసుల రాక 15 ఏళ్లగా ఎక్కువైంది. కొందరు రోజుల తరబడి స్థానికంగానే ఉంటూ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఏటా 10- 15 వజ్రాలు!

వజ్రకరూరు ప్రాంతంలో లభించే వజ్రాలు అత్యంత విలువైనవిగా చెబుతుంటారు. రూ.లక్ష మొదలుకుని రూ.50 లక్షలకు పైగా విలువైన వజ్రాలు ఇక్కడ లభిస్తున్నట్లు సమాచారం. వజ్రకరూరు, రాగులపాడు, కమలపాడు, బోడిసానిపల్లి, పొట్టిపాడు గ్రామాల పరిధిలోని ఎర్ర నేలల్లో అన్వేషించే వారికి ఏటా 15 నుంచి 20 వజ్రాలు దొరుకుతున్నట్లు అంచనా. వీటిని గుత్తి, కర్నూలు జిల్లా పెరవలి, జొన్నగిరి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా కొనుగోలు చేస్తున్నారు. వజ్రం రంగు, జాతిని బట్టి క్యారెట్ల రూపంలో లెక్కగట్టి ధర నిర్ణయిస్తున్నారు. విక్రయదారులకు డబ్బుతో పాటు బంగారం ముట్టజెబుతున్నారు. విక్రయదారులకు ధర నచ్చని పక్షంలో టెండర్ పద్ధతిలో వజ్రాలను వ్యాపారులు కొనుగోలు చేస్తుండడం గమనార్హం. వజ్రాన్వేషణ జరిగే ప్రాంతాల్లో ప్రత్యేకంగా తమ మనుషుల (ఏజెంట్ల)ను పెట్టి వజ్రాలు దొరికిన వారి సమాచారం వ్యాపారులు సేకరించుకుంటున్నారు.

ఇక్కడే ఎందుకంటే..

వజ్రకరూరుతో పాటు ఈ ప్రాంతానికి 50 కి.మీ.లోపే దూరం ఉన్న కర్నూలు జిల్లా జొన్నగిరి, తుగ్గలి, పగిడిరాయి ప్రాంతాల్లోనూ వజ్రాలు లభిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో వజ్రాలు లభించే కింబర్‌లైట్ పైపులు భూఉపరితలానికి అతి దగ్గరలో ఉన్నాయని గనులు, భూగర్భశాఖ అధికారులు చెబుతున్నారు. దానికితోడు ఈ ప్రాంతంలోని భూమి గడిచిన ఐదువేల సంవత్సరాల్లో దాదాపు అర కిలోమీటరు మేర కోతకు గురైందని, అందుకే ఇక్కడ తరచూ వజ్రాలు దొరుకుతున్నాయని అంటున్నారు. వజ్రకరూరు ప్రాంతంలో వజ్రాన్వేషణకు 1934 సంవత్సరంలోనే బ్రిటీష్ వారు 'ది న్యూ వజ్రకరూరు డైమండ్ మైనింగ్ కంపెనీ లిమిటెడ్' స్థాపించారు. వజ్రాలు లభించే పొలాలను సేకరించారు. ఈ కంపెనీని స్వాతంత్ర్యం వచ్చాక 1970లో నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) పరిధిలోకి తెచ్చారు. 1974 నుంచి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) ఆధ్వర్యంలో వజ్రాన్వేషణ చేపడుతున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలోనే వజ్రకరూరులోని వజ్రాల ప్రక్రమణ కేంద్రం (డైమండ్ ప్రాసెసింగ్ ప్లాంట్) నడుస్తోంది. ఒకప్పుడు ఇక్కడ కార్యకలాపాలు చురుగ్గా జరిగేవి. వివిధ కారణాలతో ప్రస్తుతం మందగించాయి. కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా ఈ ప్రాంతంలోని వజ్ర నిక్షేపాలపై దృష్టి సారించినప్పటికీ మైనింగ్‌కు మాత్రం ముందుకు రాలేదు.

ఏటా వస్తుంటా



ఈ ప్రాంతంలో లభించే వజ్రాలకు మంచి ధర పలుకుతుంది. అందుకే ప్రతిఏటా తొలకరి వర్షాలు మొదలుకాగానే ఇక్కడికి వచ్చి వెతుకుతుంటా. ఎప్పుడో ఒకసారైనా అదృష్టం వరించకపోతాదా అన్న ఆశతో వెతుకుతున్నా. నాతో పాటు మా ప్రాంతం నుంచి చాలామంది ఇక్కడికి వస్తుంటారు.
– సురేష్, పత్తికొండ, కర్నూలు జిల్లా

చిన్న వజ్రం దొరికినా చాలు..



ఈ ప్రాంతంలో చాలా కాలం నుంచి వజ్రాల కోసం వెతుకుతున్నారు. నేను కూడా వర్షం వచ్చిన ప్రతిసారీ ఇక్కడ వెతుకున్నా. చిన్న వజ్రం దొరికినా చాలు కష్టాలు తీరిపోతాయి. వజ్రం దొరుకుతుందన్న ఆశతోనే వచ్చా.
– లక్ష్మి, ఛాయాపురం, వజ్రకరూరు మండలం

మూడోసారి వచ్చా



వజ్రాలు వెతకడానికి మూడో సారి వచ్చా. అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నా. వజ్రం దొరికితే మా తలరాత మారుతుంది. అందుకే దొరకలేదని నిరాశ చెందక మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తున్నా.
– నాగరాజు, దిబ్బసానిపల్లి, పామిడి మండలం

బ్రిటీష్ కాలం నుంచే లభ్యం



మండలంలోని పలు ప్రాంతాల్లో బ్రిటీష్ కాలం నుంచే వజ్రాలు దొరుకుతున్నాయి. ఇండియన్ ట్రెజరీ ట్రోవ్ యాక్ట్ – 1876 ప్రకారం భూమిలో దొరికే విలువైన ఖనిజాలను ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. కానీ వజ్రాలు దొరికే సమాచారం మా వరకు రావడం లేదు.
– అనిల్‌కుమార్, తహసీల్దార్, వజ్రకరూరు

మరింత పటిష్టంగా 'ఈ-నామ్'

- మార్కెట్‌యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి


ట్రేడర్లతో మాట్లాడుతున్న జయలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: చీనీ రైతులకు మరింత మేలు జరిగేలా 'ఈ-నామ్' విధానాన్ని మరింత పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి (సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ) ఆర్.జయలక్ష్మి తెలిపారు. ఈ-నామ్ అంశంపై సోమవారం యార్డు కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ సమావేశ మందిరంలో చీనీ క్రయ విక్రయాలు సాగించే ట్రేడర్లు, యార్డు సిబ్బందితో ఆమె సమావేశమై మాట్లాడారు. రైతుకు గిట్టుబాటు ధరలు దక్కేలా ఈ-నామ్ విధానంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద చీనీ మార్కెట్‌గా ఉన్న 'అనంత'లో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రూ.3.50 కోట్లతో చేపట్టిన ఓపెన్ షెడ్ నిర్మాణం తుది దశకు చేరుకుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ నేతృత్వంలోని పాలకవర్గం సహకారంతో యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కమీషన్లు, సూట్లు లాంటి వాటితో రైతులకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సబబు కాదు

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



వజ్రకరూరు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని, అత్యంత ప్రజాదరణ పొందిన ఈ పథకాల్లో ఏ ఒక్కటైనా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు చేయడం లేదంటూ కమలనాథులను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. సోమవారం వజ్రకరూరు మండలం ఛాయాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓటమిని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. దీంతో అసహనానికి గురై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించడం వల్లనే బీజేపీకి కన్నడిగులు గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాతనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ విషయాలేవీ తెలుసుకోకుండా జగన్ సర్కార్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి జరిగిన అన్యాయాన్ని రాష్ట్ర ప్రజలు ఎవరూ విస్మరించలేదన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి నిధులను కేటాయించడం కేంద్ర బాధ్యత అన్నారు. ఈ నిధులు కూడా రాష్ట్ర ప్రజలు పన్నుల రూపంలో కేంద్రానికి చెల్లించినవేనన్నారు. అమిత్ షా వ్యాఖ్యలు చూస్తుంటే తెర వెనుక చంద్రబాబు ఉన్నట్లుగా స్పష్టమవుతోందన్నారు.

'పోలీసు స్పందన'కు 191 వినతులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 191 వినతులు అందాయి. ఎస్పీ కె. శ్రీనివాసరావు స్వయంగా వినతులు స్వీకరించి అర్జీదారులతో నేరుగా మాట్లాడారు. కీలక వినతులపై స్పందించిన ఎస్పీ నేరుగా సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బొప్పేపల్లిలో ఘర్షణ

యల్లనూరు: అమ్మవారికి జంతుబలి ఇచ్చే అంశంపై రెండు సామాజిక వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. యల్లనూరు మండలం బొప్పేపల్లిలో ఆదివారం పెద్దమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కురుబ, బోయ సామాజిక వర్గాలకు చెందిన వారు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. అనంతరం జంతు బలి ఇచ్చే సమయంలో తాము ముందంటే తాము ముందని ఇద్దరు వ్యక్తులు వాగ్వాదానికి దిగారు. సకాలంలో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో వివాదం అప్పటికి సద్దుమణిగింది. సోమవారం ఉదయం మరోసారి రెండు వర్గాలు ఒకరిపై ఒకరు సవాల్ విసురుకుంటూ రాళ్లు, కట్టెలతో పరస్పర దాడులకు తెగబడ్డారు. రాళ్ల దాడిలో బాలశివ తల, చేతులకు, ఓబులేసుకు చేతికి, పెదవికి తీవ్ర గాయాలయ్యాయి. మరో వర్గంలోని వీర ప్రసాద్ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పుట్లూరు సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ రామకృష్ణ ఆగమేఘాలపై గ్రామానికి చేరుకుని ఘర్షణను నివారించారు. క్షతగాత్రులను తొలుత తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పరస్పర ఫిర్యాదు మేరకు రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీరాజ్ ఈఈపై వేటు

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రంలోని ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్(పీఐయూ) ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా పనిచేస్తున్న రవిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ) యమ్మాని భాగ్యరాజ్ సోమవారం తెలిపారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఆయన వ్యవహారశైలిపై వెల్లువెత్తిన ఆరోపణల నేపథ్యంలో ఇటీవల పీఆర్ అధికారులు విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. అందిన విచారణ ఆధారంగా ఆయనను తాడిపత్రి సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ)గా యథాస్థానానికి పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

రిమాండ్‌కు వాహనాల దొంగ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి సొమ్ము చేసుకుంటున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను సోమవారం అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ రెడ్డప్ప వెల్లడించారు. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన డేగల సాయి అలియాస్ దొంగ సాయి వ్యసనాలకు బానిసయ్యాడు. తన వ్యసనాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో పలుమార్లు పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. ఆదివారం రాత్రి అనంతపురంలోని పాతూరులో ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరిస్తూ పోలీసులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ద్విచక్ర వాహనంతో పాటు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

నేడు 'ఏసీఎల్' తుదిపోరు

అనంతపురం: అనంత క్రీడా గ్రామం వేదికగా సాగుతున్న అనంతపురం క్రికెట్ లీగ్ (ఏసీఎల్) ఫైనల్ మ్యాచ్ మంగళవారం నిర్వహించనున్నారు. ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌లో అనంత రైజింగ్ స్టార్ మొత్తం 6 మ్యాచ్‌ల్లో 5 మ్యాచ్‌లు గెలుపొంది ఫైనల్స్‌కు చేరుకోగా... 6 మ్యాచ్‌ల్లో 3 మ్యాచ్‌లను కోగటం వారియర్స్ గెలుపొంది తుదిపోరుకు సిద్ధమైంది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఫైనల్ మ్యాచ్‌ను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూఫెర్రర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ తదితరులు హాజరుకానున్నారు.

జిల్లాలో చిరుధాన్యాల సాగు పెరగాలి

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం


మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రస్తుత ఖరీఫ్‌లో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. చిరుధాన్యాల సాగు అంశంపై సోమవారం తన చాంబర్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. చిరుధాన్యాల సాగుపై రైతులను చైతన్య పరచాలన్నారు. ఈ దిశగా డివిజన్, మండల స్థాయిలో, రైతు భరోసా కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలన్నారు. తక్కువ పంట కాల వ్యవధి, తక్కువ నీరు, తక్కువ ఖర్చుతో రాగి, జొన్న, కొర్ర పంటలు సాగు చేయవచ్చన్నారు. పంటను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. గత ఖరీఫ్‌లో 5,300 ఎకరాల్లో జొన్న, 100 ఎకరాల్లో రాగి, 5,700 ఎకరాల్లో కొర్ర సాగు అయిందని,ఇ ఈ ఖరీఫ్‌లో 10 వేల ఎకరాలు జొన్న, వెయ్యి ఎకరాల్లో రాగి, 6,500 ఎకరాల్లో కొర్ర సాగు లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నట్లు పేర్కొన్నారు. లక్ష్యసాధనకు మండల వ్యవసాయ అధికారులు కృషి చేయాలని సూచించారు.

17న బియ్యం వేలం..

జిల్లాలో 6-ఎ కేసుల్లో సీజ్ చేసిన 721.85 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఈ నెల 17న బహిరంగ వేలం వేయనున్నట్లు జేసీ కేతన్‌గార్గ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న ట్రేడర్లు, రైస్ మిల్లర్లు, వ్యాపారులు జిల్లా పౌర సరఫరాల అధికారి, అనంతపురం పేరిట రూ.లక్ష మొత్తానికి డీడీ తీసి అర్జీతో జతచేసి ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 3గంటల్లోపు జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో అందజేయాలి. అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో వేలం ప్రక్రియ ఉంటుంది. బహిరంగ వేలం అనుమతించేందుకు, రద్దు చేసేందుకు తుది నిర్ణయం జాయింట్ కలెక్టర్ పరిధిలోనే ఉంటుంది.

యువకుడి బలవన్మరణం

రాప్తాడు రూరల్: కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన బాబయ్య కుటుంబం ఏడాది క్రితం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లిలోని ఇందిరమ్మ కాలనీకి వలస వచ్చింది. బాబయ్య దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనారోగ్యం కారణంగా తండ్రి ఇంటి వద్దనే ఉంటుండడంతో కుమారుడు బాబ్జాన్ (20) కూలి పనికి వెళ్తున్నాడు. అన్నకు తోడుగా చెల్లెలు సైతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనికి వెళుతోంది. కాగా, కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న బాబ్జాన్ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా పూర్తిస్థాయిలో నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ఉద్యమంలా సాగాలి

- కార్మిక శాఖ ఉప కమిషనర్ రఘురాములు పిలుపు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అనంతపురం అర్బన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ఓ ఉద్యమంలా సాగాలని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే ఆశించిన ఫలితం ఉంటుందని కార్మికశాఖ ఉప కమిషనర్ రఘురాములు అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని సోమవారం అనంతపురంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద నుంచి చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ మాట్లాడుతూ... పిల్లలు పనుల్లో కాదు బడుల్లో ఉండాలనే నినాదాన్ని వ్యాప్తి చేయాల్సిన బాధ్యతను అందరూ తీసుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం భారత ప్రభుత్వం 1986లో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. దీని ప్రకారం 14 ఏళ్ల లోపు వయసున్న పిల్లలు ఎక్కడా పనిచేయడానికి వీలు లేదన్నారు. 14 నుంచి 18 ఏళ్ల వయసు మధ్య ఉన్న పిల్లలు ప్రమాదకర వృత్తులు, ప్రక్రియల్లో పనిచేయకూడదన్నారు. ఏఎస్పీ విజయ భాస్కర్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని 24, 39, 49వ అధికరణాల ప్రకారం బాలలకు శ్రమ దోపిడీ నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, డీఈఓ సాయిరాం, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయండి


తోపుదుర్తి నయనతారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మండల కన్వీనర్, యూత్ కన్వీనర్

ఆత్మకూరు: మండలంలో ప్రతి ఒక్కరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మహిళా సహకార డెయిరీ చైర్‌పర్సన్ తోపుదుర్తి నయనతారెడ్డి నూతన కన్వీనర్లకు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా బాలపోతన్న, యూత్ కన్వీనర్‌గా గూలి కొండారెడ్డి ఎంపికైన సందర్భంగా నయనతారెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ పార్టీ కోసం సమష్టిగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, నాయకులు వాసుదేవరెడ్డి, సంజన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక ఆరోరోడ్డుకు చెందిన బేల్దారి దూదేకుల ఇబ్రహీం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు మట్కాబీటర్ల అరెస్ట్ : స్థానిక నాల్గో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రాంనగర్, విశ్వశాంతి కాలనీల్లో మట్కా రాస్తున్న పోతులయ్య, సుంకన్న, వేణుగోపాల్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.95 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

చిరు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రవికుమార్

రాప్తాడు: చిరు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఏడీఏ రవికుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని బొమ్మేపర్తి రైతు భరోసా కేంద్రంలో రైతులతో సిరిధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ మనం తినే ఆహారాన్ని బట్టి రోగాలు వస్తున్నాయన్నారు. సిరి ధాన్యాలతో రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో ఆరు వినతులు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ఆరు వినతులు వచ్చాయి. డిప్యూటీ కమిషనర్ సావిత్రి ఫిర్యాదులను స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ - 3, రెవెన్యూ - 3 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, మేనేజర్ లక్ష్మీదేవి, డీఈ శేఖర్, సూపరింటెండెంట్లు విజయ్‌కుమార్, దేవశంకర్, ఖయ్యూం పాల్గొన్నారు.

బాలకార్మికులను వేధించడం నేరం


ర్యాలీ నిర్వహిస్తున్న రెయిన్ అనాథ చిన్నారులు

అనంతపురం కల్చరల్: చిన్నపిల్లలను వేధించడం, వారిని పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని రెయిన్‌బో హోం ప్రాజెక్ట్ డైరెక్టర్ సద్దాం బాషా అన్నారు. సోమవారం సాయంత్రం క్రీసెంట్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగర వీధుల్లో ర్యాలీ చేశారు. సీఆర్‌డీఎస్ పీడీ సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, నైతికంగా హానికలిగించే చర్యలు అమానుషమన్నారు. కార్యక్రమంలో హోం మేనేజర్ పుష్పలత, శిల్ప, త్రివేణి, రాణి, రూప, మమత తదితరులు పాల్గొన్నారు.

28 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

అనంతపురం రూరల్: సియాన్ ఈహెచ్‌డబ్ల్యూ కంపెనీ ఆధ్వర్యంలో పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ నియామాల్లో 28 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ట్రైనీలుగా నియమిస్తారన్నారు. వార్షిక వేతనం రూ.2 లక్షలు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె కృష్ణకిశోర్ అభినందించారు.

● ప్రమాదకరం.. ఇనుప ద్వారం


ప్రమాదకరంగా ఉన్న స్తంభం

నగరంలోని టీటీడీ కల్యాణమంటపం వద్ద భారీ వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన ఇనుప ద్వారం ప్రమాదకరంగా మారింది. పెద్ద ఇనుప రాడ్‌లతో ఏర్పాటు చేసిన ద్వారం కూలడానికి సిద్ధంగా ఉండడంతో స్థానికులు, అటుగా వెళ్లే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గాలివీచినా, వర్షం వచ్చినా ప్రమాదమేనని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


టీటీడీ కళ్యాణ మంటపం వద్ద ప్రమాదకరంగా ఉన్న ఇనుప ద్వారం



నేలకుంగిపోవడంతో ప్రమాదకరంగా మారిన ఇనుప స్తంభాలు

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల మధ్య విద్యుత్ అంతరాయం ఉంటుందని నగర డీఈఈ నాగేంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీ-1 సెక్షన్ పరిధిలోని జీసస్‌నగర్, హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్, ఆదర్శనగర్, లక్ష్మీనరసయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

పారదర్శకత పాటించాలి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సదరం సర్టిఫికెట్ల మంజూరులో పారదర్శకత పాటించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించినట్లు సమాచారం. సోమవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణవేణి, పీహెచ్‌సీ వైద్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. వివిధ విభాగాల వైద్యులు ఎన్ని సర్టిఫికెట్లు మంజూరు చేశారని ఆరాతీశారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో రోగులకు మెరుగైన సేవలందించారని, అదేస్ఫూర్తితో పని చేయాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ల మంజూరుపై ఫిర్యాదులొస్తున్నాయని, జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

విద్యార్థుల బంగారు భవితే ప్రభుత్వ లక్ష్యం


'జగనన్న విద్యాకానుక' కిట్లతో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు


ఆత్మకూరులో కిట్లు అందిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: విద్యార్థులు ఉన్నత భవితే ప్రభుత్వ లక్ష్యమని మేయర్ వసీం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. సోమవారం అరవిందనగర్‌లోని శ్రీ కృష్ణదేవరాయ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న విద్యా కానుక కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, డీఈఓ సాయిరాంతో కలసి ఆయన విద్యార్థులకు విద్యాకానుకను అందించారు. మేయర్ మాట్లాడుతూ మూడు జతల యూనిఫాం క్లాత్, జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక సెట్ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్కాలు, బ్యాగ్, యూనిఫాం కుట్టుకూలి రూ.120 విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. నాడు-నేడు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ స్కూళ్లకు కార్పొరేట్ సూళ్లగా మార్చారన్నారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వివిధ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటస్వామి, హెచ్ఎం శ్యాంగోపాల్, నాయకులు ఖాజా, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేశారని ఎంపీపీ సుబ్బర హేమలత అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ హేమలత, ఎంఈఓ నరసింహారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం

రాప్తాడు: నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, మండల యూఐత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో జగనన్న విద్యా కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. స్పోర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం 'అమ్మ డెయిరీ' ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. గొందిరెడ్డిపల్లి గ్రామంలో వాటర్ షెడ్ పథకం కింద రైతులకు పీవీసీ పైపులు, స్ప్రింకర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్లు, చాఫ్ కటర్స్, ఎం.బండమీదపల్లిలో రైతులకు వేరుశన విత్తన కాయలు పంపిణీ చేశారు. హంపాపురంలో జగనన్న విద్యాకానుక కిట్లను వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, ప్రిన్సిపాల్ పద్మజా దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రాప్తాడులో విద్యార్థులకు జగనన్న కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

బీజేపీ మాటలు అర్థరహితం

● మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గౌస్‌బేగ్

అనంతపురం క్రైం: ప్రభుత్వంపై కేంద్ర మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన ఆరోపణలు అర్థరహితమని వైఎస్సార్ సీపీ మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గౌస్‌బేగ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ కోవర్టులైన బీజేపీ నేతలు సీఎం రమేష్, సుజనాచౌదరి, టీజీ వెంకటేష్, పురందేశ్వరి, సత్యకుమార్, గరికపాటి రామ్మోహన్ ఇచ్చిన స్క్రిప్ట్ కాకుండా వాస్తవాలను బీజేపీ నాయకులు మాట్లాడాలన్నారు. దేశ చరిత్రలో ఏ సీఎం చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.10 లక్షల కోట్లు (రెండు లక్షలా పది వేల కోట్ల రూపాయలు) జమ చేశారన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీతో అంటగాగిన బీజేపీ నాయకులు ఆ పార్టీ అవినీతిలో మీ భాగస్వామ్యాన్ని అంగీకరిస్తారా అని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ఏపీ ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డివైపే ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గౌస్‌బేగ్

సర్వజనాస్పత్రిలో వైద్యుల ఇష్టారాజ్యం

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. ఆస్పత్రుల్లో సరిపడా సదుపాయాలు కల్పిస్తోంది. రోగులకు మెరుగైన సేవలు అందించాలని చెప్తున్నా.. సర్వజనాస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు విభా గాల్లో ఇష్టారాజ్యంగా సేవలు అందిస్తున్నారని రోగు లు, వారి బంధువులు అంటున్నారు. మానసిక వైద్య విభాగం, పల్మనాలజీ విభాగాల్లో సిబ్బంది మధ్య కోల్డ్‌వార్‌తో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.


అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో అడ్మిషన్‌లో ఉన్న అమ్మాయిని సముదాయిస్తున్న సిబ్బంది

ఇక్కడ ఏమి జరుగుతోందంటే...

పాత ఐడీ వార్డులో ఉన్న మానసిక వైద్య విభాగం (సైకియాట్రి) వార్డును కోవిడ్ సమయంలో కోవిడ్ సెంటర్‌గా మార్చారు. మళ్లీ మానసిక వైద్య విభాగానికి కేటాయించారు. ఇటీవల కోవిడ్ కేసులు నమోదవుతుండడంతో ఐడీ వార్డులోని సగ భాగాన్ని కోవిడ్ రోగులకు, మిగిలిన సగభాగాన్ని మానసిక వైద్య విభాగానికి కేటాయించారు. ఎవరికైనా కోవిడ్ సోకితే అందరికీ ప్రమాదమని భావించిన మానసిక వైద్య విభాగం వైద్యులు వార్డును ఖాళీ చేసి డీ అడిక్షన్ సెంటర్‌లోనే రోగులను అడ్మిన్ చేస్తున్నారు. అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో ప్రాణాంతక కేసులను వెంటిలేటర్‌పై ఉంచుతారు. అలాంటి వార్డులో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన మానసిక రోగి (అమ్మాయి)ని అడ్మిట్ చేశారు. ఆ అమ్మాయి గట్టిగా అరవడం, కేకలు వేయడంతో అక్కడ సమస్యగా మారింది. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ మానసిక సమస్యతో ఉన్న వారికి ఏఎంసీలో ఉంచొచ్చు.. వారిని అక్కడ అడ్మిట్ చేసి మెరుగుపడ్డాక విశాఖ ఆస్పత్రికి పంపతామన్నారు. అయినా ఓసారి మానసిక వైద్య విభాగాధిపతి వైద్యనాథ్‌తో మాట్లాడాలని సూచించారు.

ఎక్స్‌రే కోసం రోగుల అవస్థలు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డిజిటల్ ఎక్స్‌రే కోసం రోగులు అవస్థలు పడాల్సి వస్తోంది. సోమవారం ఎక్స్‌రే తీయించుకునేందుకు రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. డిజిటల్ ఎక్స్‌రే క్యాస్కెట్స్ తక్కువగా ఉండడంతో ఎక్స్‌రేలు తీయడానికి జాప్యం జరుగుతోంది. రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు పెడితే కొత్త క్యాస్కెట్లను కొనుగోలు చేయొచ్చు. హెచ్‌డీఎస్ నిధుల్లో రూ.లక్షలు మూలుగుతున్నా..అధికారులు ముందుచూపుతో కొనుగోలు చేయడానికి వెనుకాడుతున్నారు.ఆస్పత్రి సూపరింటెండెంట్, రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు, రేడియాలజీ హెచ్‌ఓడీ, తదితరులు ఎక్స్‌రే విభాగాలను పరిశీలించి, పరిస్థితి చక్కదిద్దాలని రోగులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం ఎందుకో.. : సర్వజనాస్పత్రిలోని గైనిక్ వార్డులో దోబీ ట్రాలీ ఉంచారు. గర్భిణులు, బాలింతలు అటు ఇటూ తిరుగుతూ ఉంటారు. ఇలాంటి ప్రాంతంలో దోబీ ట్రాలీ ఉంచడంతో పొరపాటున గర్భిణులకు తగిలే అవకాశం ఉంది.

మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత జగన్ ఘనతే

● నగరపాలక సంస్థ మేయర్ వసీం

అనంతపురం సిటీ: ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మేయర్ వసీం , వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. సోమవారం అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ఎ.నారాయణపురం పంచాయతీలోని మస్జిద్-ఏ-మహమ్మదీయలో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్రంలో మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి, కార్పొరేటర్ స్థాయి నుంచి డిప్యూటీ సీఎం పదవి వరకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు మనమంతా రుణపడి ఉందామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి ముస్లింల గుండెల్లో శాశ్వతంగా నిలచిపోయారన్నారు. ప్రస్తుతం ముస్లింలు విద్య, ఉద్యోగావకాశాల్లో నిలదొక్కుకుంటూ తమ ఉనికి చాటుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముస్లింల మేలు కోరే వైఎస్ జగన్ వెంటే మనమంతా నడుద్దామని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, బాబాఫకృద్దీన్, ఇషాక్, ముతవల్లి, మహమ్మద్ రసూల్, ఇమామ్, షాకీర్, కమిటీ సభ్యులు మహబూబ్‌బాషా, నాయకులు జావిద్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న మేయర్ వసీం, తదితరులు

మినహాయింపు ఇవ్వండి


రామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం ప్రతినిధులు

రాప్తాడురూరల్: వైద్యశాఖలో పని చేస్తున్న డ్రైవర్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ రామిరెడ్డిని ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం విన్నవించింది. ఈ మేరకు సోమవారం విజయవాడలో ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, కర్నూలు జిల్లా అధ్యక్షులు వై. నాగేశ్వరావు తదితరులు రామిరెడ్డిని కలిశారు.

ఘనంగా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

రాప్తాడురూరల్: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నారు. అనంతరం పదో తరగతిలో 593 మార్కులు సాధించిన విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రెవ మనిష్షే, పాస్టర్ నవీన్, పాస్టర్ లీనా డెబోరా, రెవరెండ్ జి. మాథ్యూస్,డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ, బండెల రాజు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు మార్క్ , కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అనంతపురం టౌన్: విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ సోమవారం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై ప్రభుత్వం పునరాలోచించి చార్జీలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామిరెడ్డి, ముస్కిన్, వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్ పాల్గొన్నారు.

త్యాగరాజ సంగీత సభ పూర్వ వైభవానికి కృషి

● చిన్మయా మిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి

అనంతపురం కల్చరల్: త్యాగరాజ సంగీత సభ పూర్వ వైభవానికి కృషి చేస్తానని చిన్మయామిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. సోమవారం సంగీత సభ నిర్మాణ పనుల్లో భాగంగా సభ భవన ప్రాంగణంలో శ్రీలక్ష్మీ గణపతి, వాస్తు, సుదర్శన హోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేద పండితులు హోమాలు, పూర్ణాహుతితో ఘనంగా ముగించారు. త్యాగరాజ సంగీత సభ అధ్యక్షులు ఎన్సీ సంపత్‌కుమార్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి కవి నబీరసూల్, పాల సముద్రం నాగరాజు, నామసేవా హరికృష్ణమాచార్యులు తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జెమినీ బాబు, రేణుకాదేవి, పద్మజ, లత, దేవరకొండ కౌసల్య, విజయ్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఛార్జెస్ ఫ్రేమ్ చేస్తా

అనంతపురం క్రైం: వేకువజామున విధులకు హాజరుకాకపోతే ఛార్జెస్ ఫ్రేమ్ చేస్తానని కమిషనర్ రమణారెడ్డి పారిశుధ్య కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం సెల్‌కాన్ఫరెన్స్ ద్వారా పారిశుధ్య కార్యదర్శులకు కమిషనర్ పలు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

పారిశుధ్య కార్యదర్శికి మెమో: పారిశుధ్యం మెరుగులో నిర్లక్ష్యం వహించిన పారిశుధ్య కార్యదర్శి సూర్యప్రకాష్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డిని కమిషనర్ ఆదేశించారు.

ప్రారంభమైన సీఏఎస్ ఇంటర్వ్యూలు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద పదోన్నతులు కల్పించేందుకు నిర్వహించిన ఇంటర్వ్యూలు సోమవారం ప్రారంభమయ్యాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్, అసోసియేట్ నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతులు దక్కనున్నాయి. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అధ్యక్షతన ఇంటర్వ్యూలు నిర్వహించారు. గవర్నర్ నామినీ, వివిధ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్లు హాజరయ్యారు. ఈసీఈ విభాగం నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి , కంప్యూటర్ సైన్సెస్ విభాగం నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శివకుమార్, డాక్టర్ మాధవి, కెమిస్ట్రీ విభాగం నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శేషమహేశ్వరమ్మ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించారు. మెకానికల్ విభాగం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధాకళ్యాణి, ఈఈఈ విభాగం నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్ గౌడ్, కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సరితకు అసోసియేట్ ప్రొఫెసరుగా పదోన్నతి దక్కనుంది. ఇంటర్వ్యూలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డీఏపీ ప్రొఫెసర్ వి.సుమలత, ప్యానల్స్ మెంబర్లు పరిశీలకులుగా ఉన్నారు.


ఇంటర్వ్యూ జరుగుతున్న దృశ్యం

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం టౌన్: విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్జీఓ హోంలో కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో మూడో పార్టీ విధానాన్ని రద్దు చేసి, కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగులకు నేరుగా జీతాలు అందజేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, చంద్రశేఖర్, వెంకటేశ్వరప్రసాద్, జయరాజ్ పాల్గొన్నారు.

కారు బోల్తా .. ముగ్గురికి గాయాలు

రాప్తాడు: మండలంలోని మరూరు టోల్ ప్లాజా వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని కమలానగర్‌కు చెందిన నాగేశ్వరరావు, శివలక్ష్మి, లత కారులో బెంగళూరుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మరూరు టోల్ ప్లాజా సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న అతిథులు

అనంతపురం కల్చరల్: వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా చిన్నారులు ప్రతిభాపాటవాలతో ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా స్థానిక లలితకళా పరిషత్తులో సోమవారం శ్రీ డాన్సు అకాడమీ వార్షికోత్సవం నిర్వహించారు. డాన్సు మాస్టర్ శ్రీకాంత్ నేతృత్వంలో చిన్నారులు సినీ, జానపద, శాస్త్రీయ నృత్యాలతో ఆహూతులను అలరించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, డీఎస్పీ హనుమంతు, ఆచార్య సుధాకరబాబు మాట్లాడుతూ పాఠశాలలు తెరిచిన దృష్ట్యా ఓ వైపు చదువుపై ఏకాగ్రతను పెంచుకుంటూనే కళలను కూడా నిత్య సాధన చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో డాన్సుమాస్టర్లు లక్ష్మీకాంత్, బుల్లితెర యాంకర్ రమేష్ నీల్ తదితరులు పాల్గొన్నారు.